క్లుప్తంగా

మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, భాగ్యనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ పరిధిలో మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఏడీఈ బి. ప్రసాద్, ఏఈలు చైతన్య, పీరు నాయక్, దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, భాగ్యనగర్, ఆల్విన్‌కాలనీ పరిధిలోని వినియోగదారులకు వేసవి కాలంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ అసౌకర్యం కలిగిన, అంతరాయం ఏర్పడ్డ విద్యుత్ శాఖ కంట్రోల్, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెక్షన్ కూకట్‌పల్లి డీఈ నెంబర్ 9440813132, కూకట్‌పల్లి, ఏడీఈ 9440813145, ఏఈ, కూకట్‌పల్లి 9440813156, భాగ్యనగర్, ఏఈ 9440813158, ఏఈ, ఆల్విన్‌కాలనీ 9491067618, ఎఫ్‌ఓసీ, కూకట్‌పల్లి 9490610177, భాగ్యనగర్ 9490610179, ఆల్విన్‌కాలనీ 8331041820 నంబర్లలో, విద్యుత్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 లో సంప్రదించాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు పై నంబర్ల ద్వారా తమ సమస్యలను వాట్సాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చని తెలిపారు.

కృష్ణారావు మృతి విద్యా రంగానికి తీరనిలోటు


కృష్ణారావు

కూకట్‌పల్లి: లోక్‌సత్తా సీనియర్ నాయకులు, విద్యా రంగంలో 30 సంవత్సరాలుగా విశేష సేవలు అందించిన జే. కృష్ణారావు గురువారం తుది శ్వాస విడిచారు. కరీంనగర్‌కు చెందిన జే. కృష్ణారావు (88) విద్యారంగంలో పలు సేవలు అందించి గెజిటెడ్ హెడ్ మాస్టర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం లోక్ సత్తా పార్టీలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో కలిసి పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో సైతం టీజేఏసీలో పని చేశారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురైన కృష్ణారావు ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. వెంకటరావు నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

మహిళలకు సన్మానం



మూసాపేట: కూకట్‌పల్లిలోని అశోక వన్‌మాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా గురువారం పలువురు మహిళలకు సన్మానించారు. ప్రముఖ దర్శకులు, రచయిత నీలకంఠ, క్షితిజ్, సామాజిక కార్యకర్త దంతూరి వెంకటరత్నం, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ తొక్కుతూ ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నప్పటికి పట్టుదలతో ఆదర్శంగా నిలిచిన తాన్యా దాగాలను ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అశోక డవలపర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జైదీప్ రెడ్డి, అశోక వన్‌మాల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ సమస్యలను పరిష్కరించాలి


బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ, 4వ ఫేజ్ వెంచర్ 2కి సంబంధించి ఫైనల్ కాస్ట్, అధిక వడ్డీ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై బండి రమేష్ సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మనూ ఉద్యోగ మేళా తేదీ మార్పు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల కోసం నిర్వహించ తలపెట్టిన ఉద్యోగమేళా తేదీలో మార్పు చేసినట్లు 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ గురువారం తెలిపారు. గతంలో ప్రకటించినట్లుగా ఏప్రిల్ 16వ తేదీ కాకుండా ఏప్రిల్ 20వ తేదీ మేళాను నిర్వహిస్తామని, ఈ మార్పును అందరూ గమనించాలని పేర్కొన్నారు. 'మనూ'లో రెగ్యులర్, దూరవిద్యా కోర్సులు, ఇతర అర్హత కలిగిన అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాన్ని యూనివర్సిటీ లింక్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అధ్యాపకుల ఖాళీలు, ఆసక్తి గల కళాశాలలు / పాఠశాలలు/సంస్థలు ఏప్రిల్ 18వ తేదీ నాటికి రూ.5వేల రిజిస్ట్రేషన్ ఫీజుతో పాల్గొనాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో సమర్థులైన ఉపాధ్యాయులు, మానవ వనరులను పొందడానికి సహాయపడుతుందన్నారు. అనేక ఉత్తమ కళాశాలలు, పాఠశాలలు, సంస్థలు కూడా ఈ మేళాలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9848171044, 8688477911, 9044145228లో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్‌లో హోలీ సందడి



హోలి పండుగ నేపథ్యంలో మార్కెట్‌లో వివిధ రంగులు, హోలి ఆడే పిచికారీలు, చిలకల పేర్లు, కొబ్బరి దండలు ఆకర్షణీయంగా ఉన్నాయి. కూకట్‌పల్లిలోని మీ సేవ ఎదురుగా, సుమిత్ర నగర్, వివేకానందనగర్ కమాన్, మూసాపేటలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో రంగు రంగుల విక్రయాలు కొనసాగాయి. శుక్రవారం హోలి నేపథ్యంలో గురువారం సాయంత్రం కొనుగోలు చేస్తూ చిన్నారులు, పెద్దలు సందడిగా కనిపించారు. పిచికారీలు రూ.100 నుంచి 200 వరకు ధర పలుకుతున్నాయి. సహజ సిద్ధమైన రంగులతో హోలి ఆడాలని అధికారులు సూచించినా రసాయనాలతో కూడిన రంగులు కూడా మార్కెట్‌లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. – మూసాపేట





విక్రయాలతో కిటకిటలాడుతున్న దుకాణాలు

విద్యార్థులకు పరీక్ష కిట్ల అందజేత


పరీక్ష కిట్ అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్ మెయిన్ రోడ్డులోని జడ్పీహెచ్ఎస్‌లో క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల జామెట్రీ బాక్స్, ప్యాడ్, పెన్నులు అందించటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సాయికుమార్, క్షత్రియ సేవా సమితి జాయింట్ సెక్రటరీ భూపతిరాజు రామకృష్ణంరాజు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు సుధీర్ వర్మ సుధాకర్ రాజు, ప్రశాంత్ వర్మ, గౌతం వర్మ, శివాజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు


రాజేశ్వరరావును సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సంకష్ట హర గణపతి సహిత విజయదుర్గ మాత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరుగుతుంది. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం సంకష్టహర గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన సమారాధన నిర్వహించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

ఆల్విన్‌కాలనీ: దీనబందు కాలనీలో స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీలో పర్యటించి సర్వే నిర్వహించారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, లో ప్రెషర్ వల్ల నీరు సరిపోవటం లేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎవరికీ ప్రభుత్వం ఇళ్లను అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో దొంగతనాలు, పోకిరీల బెడద ఉన్న ప్రాంతాల్లో పోలీసుల పెట్రోలింగ్ పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల చివరలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.


కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, కూకట్‌పల్లి మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, పోలయ్య, చలపతిరావు, కృష్ణారావు, బాలరాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


ఏఈ ఆశతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ ఖుష్ నగర్‌లోని వివిధ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కోరారు. కాలనీ వాసులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన గురువారం జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి ఏఈ ఆశ, స్థానిక ప్రజలతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ ఆశను కోరారు.

సమస్యలు పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రజా సమస్యలపై గురువారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా డివిజన్‌లలోని సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల డ్రైన్లు, వీధి దీపాలు, శ్మశాన వాటికలు, పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాసరావు, సతీష్ గౌడ్, సబిహా బేగం, రోజా దేవి రంగారావు, శిరీష, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు సూచిక బోర్డుల ఏర్పాటు



బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ప్రజల సౌకర్యార్థం, స్థానికులకు పోలీస్‌స్టేషన్ సరిహద్దుల గురించి అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో సీఐ నరసింహరాజు పోలీస్‌స్టేషన్ అధికార పరిధిలను సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు. గురువారం బాలానగర్ ఏసీపీ హనుమంతరావు చేతుల మీదుగా ఐడీపీఎల్ కూడలిలో ఈ బోర్డులను ప్రజల అవసరార్థం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ హనుమంతరావు మాట్లాడుతూ.. ఈ బోర్డుల ఏర్పాటుతో ప్రజలకు తమ ప్రాంతం ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలుస్తుందన్నారు. దీనివల్ల వారు తమ సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. బోర్డులపై పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, వీధులు, కూడళ్ల వివరాలతో పాటు పోలీస్‌స్టేషన్, అధికారుల ఫోన్ నంబర్లు సమకూర్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాంనారాయణ, సరళ, ఏఎస్ఐ ప్రభాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో హోలీ సందడి

మూసాపేట: మూసాపేటలోని శ్రీహరినగర్‌లోని కిడ్జీ మౌంట్ లిటేరా పాఠశాలలో గురువారం హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపైఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి మన జీవితంలో రంగులతో ప్రయోజనాలు, వాటి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో విద్యార్థులు హోలి సంబరాల్లో పాల్గొన్నారు.


వేడుకల్లో కిడ్జీ మౌంట్ లిటేరా పాఠశాల చిన్నారులు


పంచశీల స్కూల్‌లో..

ఎల్‌ఆర్ఎస్‌ను గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్

నిజాంపేట్ : ఎల్‌ఆర్ఎల్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు కీలకమైన సూచనలు చేశారు. ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియపై ఆరాతీసి, ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ ఏవిధంగా చేస్తున్నారని వార్డు ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందని దరఖాస్తుదారులకు వార్డు ఆఫీసర్లు తెలపాలని, ఆ దిశగా జిల్లాలోని మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా అప్లికేషన్ నంబర్, పేరు, మొబైల్ నెంబర్ మొదలగు వివరాల ద్వారా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేసి రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణ కాపీలను వీలైనంత తొందరగా అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని వల్ల ప్రజల్లో నమ్మకం కలిగి మిగతావారు కూడా రుసుము చెల్లించడానికి ముందుకొచ్చే అవకాశం ఉందని తెలిపారు. సాంకేతిక సమస్యల ద్వారా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు క్రమబద్ధీకరణ దరఖాస్తుల పై పురోగతిని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు పరిగణలోకి తీసుకొని సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలు చేసే ప్రక్రియ వేగంతం చేసి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

లక్ష్యాన్ని అధిగమించాలని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కార్పొరేషన్ పరిధిలో యూనిఫామ్ టాక్స్ పద్ధతిని అమలు పర్చడానికి కృషి చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కంచె నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సబేర్ అలీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సందర్శించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. వివిధ అంశాలపై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలు, ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి, సాంకేతిక ఆవిష్కరణలు, ఆరోగ్య పరిరక్షణపై నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇటువంటి


నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

టి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగు పరచవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయికుమార్, ప్రిన్సిపాల్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాసిల్క్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



మోతీనగర్: వేసవి కాలంలో ఖాదీ, లెనిన్ వంటి వస్త్రాలు ధరిస్తే అనుకూలంగా ఉంటుందని కళా సిల్క్ నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. కళా సిల్క్‌లో ఆంధ్రప్రదేశ్, ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి కళంకారి, ఉప్పాడ, అస్సాం సిల్క్, బీహార్ బగల్పూర వస్త్రాలు, జమ్మూ, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ డ్రెస్‌మెటీరియల్స్, కర్ణాటక క్రేప్ ప్రింటెడ్ శారీలు, మధ్యప్రదేశ్, చందేరి, మహేశ్వరి, రాజస్థాన్ కోట బంధాని, బ్లాక్ ప్రింట్ డ్రెస్ మెటీరియల్స్, లక్నో డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఈ మేళాలో వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, కొండపల్లి బొమ్మలు, పెయింటింగ్స్ ఈ కళాసిల్క్‌లో ఉన్నాయన్నారు. ఈ మేళా ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


సమస్యలను వివరిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని గురువారం కలిసి వివిధ సమస్యలపై మాట్లాడారు. డ్రైనేజీ సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరు చేయాలని కోరారు. పెరుగుతున్న జనావాసాలకు అనుగుణంగా కాలనీ వాసుల దాహార్తిని తీర్చడానికి, అసంపూర్తి మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి


పూలమాలేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

మోతీనగర్: బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు నార్లపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆ రోజుల్లో మహిళలకు చదువుకునే ప్రాధాన్యత ఇవ్వని రోజుల్లో సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని చదివి తెలుగులో అనువదించడానికి సాహసించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కాశోజీ, తాడూరు శ్రీనివాస్, కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, నాయకులు భిక్షపతి, శంకర్, వీరన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు ఆయా రంగాల్లో నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ప్రగతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రావు అన్నారు. కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం గాజులరామారంలోని సత్య గౌరీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు మాట్లాడుతూ.. పట్టుదలతో కష్టపడి కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించుకోవచ్చని అన్నారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ర్యాంప్‌వాక్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కళాశాల అధ్యక్షులు రంగారావు, చందానగర్ బ్రాంచి ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5.6 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

గచ్చిబౌలి: గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన వాసుదేవరెడ్డి(29), వెంకట్ రెడ్డిలు కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నట్లు టీ న్యాబ్ అధికారులు గుర్తించారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో చిత్రపురి కాలనీ సమీపంలోని లేబర్ కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో రాయదుర్గం పోలీసుల సహకారంతో దాడి చేసి నిందితుల వద్ద ఐదు కిలోల 600 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులు స్నేహితులు కావడంతో నగరంలో కలిసి ఉంటున్నారు. ఉద్యోగం కోసం వచ్చి గంజాయి పెడ్లర్లుగా మారారని పోలీసులు తెలిపారు.

అమరుల స్ఫూర్తిని కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

కూకట్‌పల్లి: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి అమరుల స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్, కార్తిక్ అన్నారు. గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గారు, సుఖ్‌దేవ్ చూపిన మార్గం ఆదర్శమన్నారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, కమిటీ సభ్యులు మహేందర్, ఆనంద్, మహేష్, ఆశిష్, రక్షిత్, మహేశ్వర్, వాసు, ప్రణయ్, కరుణాకర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు